# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం
29 ఏప్రిల్
2026


# అక్రమార్కుల ఆగడాలు.. అధికారుల మొద్దు నిద్ర

**వెరసి ప్రజలకు ఇక్కట్లు...**
**సిపిఐ(ఎం) హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు..**



**ఖమ్మం, ఏప్రిల్ 28(నినాదం ):** ఖమ్మం నగర పరిధిలో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, వారికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉండటంవల్ల నగర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఖమ్మం నగర కార్పొరేషన్ కమిషనర్ మరియు మేయర్ స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని సిపిఐ(ఎం) హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు కోరారు. ముఖ్యంగా ఖానాపురం హవేలీ పరిధిలో 55వ డివిజన్ బ్యాంక్ కాలనీ 11వ లైన్ లో ఏకంగా తన స్థలం ముందు రోడ్డును కలుపుకొని డ్రైనేజీని రోడ్డుకు జరిపి అక్రమంగా డ్రైనేజీని నిర్మించిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఈరోజు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి ఖమ్మం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించామని తిరుపతిరావు తెలిపారు. బ్యాంక్ కాలనీ 11వ లైను ప్రారంభంలో ఉన్న హారిక చికెన్ సెంటర్ యజమాని డ్రైనేజీ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా అక్కడ చికెన్ సెంటర్ నిర్వహించడం వలన స్థానిక ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా ఆ రోడ్లో కోళ్ల వ్యాన్లను నిలపడం ఆ వ్యాన్లను అక్కడే శుభ్రం చేయటం వలన మురికి వ్యర్థాలు మొత్తం రోడ్డుపైకి వచ్చి దుర్వాసనలు వెదజల్లుతున్నాయని అనేకమార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాల మధ్య దేవాలయం పక్కనే ఉన్న హారిక చికెన్ సెంటర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రోడ్డును ఆక్రమించిన చికెన్ సెంటర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అక్రమంగా నిర్మించిన డ్రైనేజీ ని కూడా వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. 12వ డివిజన్లో మమత హాస్పిటల్ న్యూ గేట్ ఎదురుగా మైత్రి నగర్ రోడ్ నెంబర్ 2 లో ఎస్ ఆర్ కే హోమ్స్ లైన్లో ఒక ఓటర్ల యజమాని మరియు ఒక బడ్డీ కొట్టు నిర్వాహకుడు రోడ్డు ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తున్నారని ఇది అక్కడి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని తమ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని ఆ బడ్డీ కొట్టు వద్ద ఆకతాయిలు చేరి సిగరెట్లు తాగడం వల్ల యువకుల గుంపులుగా చేరి వారి వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలుగజేస్తున్నారని ఈ విషయంపై అధికారులను ప్రశ్నించగా మాకు ఎలాంటి సమాచారం లేదని మాకు తెలియకుండానే డ్రైనేజీలు ప్రైవేట్ వ్యక్తులు నిర్మించుకుంటున్నారని వాటిని వెంటనే పరిశీలించి తొలగిస్తామని సిపిఎం నాయకత్వానికి వారు హామీ ఇచ్చారు. అధికారుల స్పందించి రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని రోడ్డు వెడల్పు చేసి డ్రైనేజీని నిర్మించగలరని స్థానిక ప్రజలు సిపిఎం నాయకత్వంలో ఆక్రమణలకు గురైన ప్రదేశాన్ని సందర్శించి సంతకాల సేకరించి డిప్యూటీ కమిషనర్కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం సాయిబాబు, గాలి వెంకటాద్రి, జట్ల ఆనందరావు, తాళ్లపూడి మంగమ్మ, వడ్డేపల్లి నరేంద్ర,బొగ్గర పాపారావు, మాచర్ల గోపాల్, వేదగిరి మురహరి, స్థానిక ప్రజలు ఎం గణపతి, తాళ్లూరి తాతారావు, పాల్వంచ రామారావు, ఎం ప్రభాకర్ రెడ్డి, అరుణ, తుమ్మల కుటుంబరావు, మానుకొండ వెంకటేశ్వరరావు, నర్వనేని చిన్న వెంకయ్య, మాగంటి నాగేశ్వరరావు, వంకాయలపాటి రేణుక, బొగ్గారపు వరలక్ష్మి,తుమ్మలపల్లి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



## మే డే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు**




**కల్వకుర్తి ఏప్రిల్ 28 (నినాదం) :** కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మంగళ వారం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షతన మేడే సన్నాహక సమావేశం జరిగినది. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలోనీ సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని మేడే ఉత్సవాల్లో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ప్రధానంగా 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినాల కోసం జరిగిన మహోత్తర పోరాటం వల్ల కార్మికులు అనేక హక్కులు చట్టాలు సాధించుకున్నప్పటికీ నేటి పాలకులు కార్మిక చట్టాలకు హక్కులకు భంగం కలిగించే చర్యలు చేపడుతున్నారని వాటిని రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ముందుకు రావాల్సిన అవసరం ఉందని యూనియన్లు ఉన్నా లేకున్నా కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో యూనియన్లతో నిమిత్తం లేకుండా ప్రతి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హమాలీ సంఘం ,భవన నిర్మాణ కార్మిక సంఘం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వివిధ సంఘాల నాయకులు ఎన్ బాలయ్య శ్రీశైలం రాజు గౌడ్ యాదయ్య చంద్రయ్య పర్వతాలు రమేష్ రజసంగం జిల్లా ఉపాధ్యక్షులు చిలుక బాల్రెడ్డి సిపిఎం నాయకులు ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

**కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే కాలే యాదయ్య.**



**చేవెళ్ల ఏప్రిల్ 28 (నినాదం):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజక వర్గం శంకర్‌పల్లి మున్సిపల్ పట్టణ పరిధిలో సోమవారం దోబి పేట్‌లోని ఎన్సిసి కంపెనీలో జరిగిన ప్రమాదం చాలా బాధాకరమని, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులను మంత్రి వివేక్ వెంకటస్వామి శాసనసభ్యులు కాలే యాదయ్య కలిసి పరమర్శించారు..ఈ సందర్భంగా గాయ పడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రమాదానికి సంబం ధించిన పూర్తి వివరాలను అధికారులు మరియు ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకుంటూ, బాధితులకు కంపెనీ యాజమాన్యం తరఫున అన్ని విధాలుగా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైన పరిహారం అందేలా యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు.

## భార్యాభర్తల మధ్య కుటుంబ తగాదాలు

**ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యం**



**జవహర్ నగర్, ఏప్రిల్ 28 (నినాదం):** భార్య భర్తల మధ్య కుటుంబ తగాదాలు చోటు చేసుకోగా మనస్థాపం చెందిన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ చంద్రపురి కాలనీలో సఫావత్ రాజు భార్య జ్యోతి ఇద్దరు కుమారులు జస్వంత్ యశ్వంత్ తో కలిసి నివసిస్తున్నారు. అన్యోన్యంగా సాగుతున్న కుటుంబంలో ఇటీవల గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈనెల 24న రాత్రి భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా మనస్తాపం చెందిన జ్యోతి( 30) మరసటి రోజు ఇంట్లో చెప్పకుండా పిల్లలను తీసుకొని బయటికి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికిన బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు భర్త రాజు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లేబర్ సెల్ నూతన కమిటీల ఏర్పాటు.



**చేవెళ్ల,ఏప్రిల్28(నినాదం):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజ కవర్గ పరిధిలోని మంగళవారం ఎత్తుబారుపల్లి గ్రామంలో లేబర్ సెల్ ఐ ఎన్ టీ యూ సి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీల నియామకం జరిగింది. ఈ కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అధ్యక్షత వహించారు..ఈ సందర్భంగా తోల్కట్ట గ్రామానికి అధ్యక్షుడిగా వడ్ల రవీందర్ చారి, ఎత్తుబారుపల్లి గ్రామానికి అధ్యక్షుడిగా మేకగూడెం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు, లేబర్ సెల్ అధ్యక్షురాలు పామేన జ్యోతి భీమ్ భరత్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ అధ్యక్షుడు సయ్యద్ వసీం హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా పామేన జ్యోతి భీమ్ భరత్ మాట్లాడు తూ...కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం రూపొందిం చిన భవన నిర్మాణ కార్మిక చట్టం 1996 కీలకమని పేర్కొ న్నారు. సెక్షన్ 12 ప్రకారం కార్మికులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ సెల్ ద్వారా కార్మికులకు అందుబాటులో ఉన్న హక్కులపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, తోల్కట్ట మాజీ సర్పంచ్ బొల్లిగిద్ద సత్యనారాయణ, మొయినాబాద్ మండల లేబర్ సెల్ అధ్యక్షుడు కె. హరినాథ్ గౌడ్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు ఎల్గని నరేందర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు ఉమ్మర్ ఖాన్, చనువల్లి కృష్ణ, మల్లని దాస్, బేగరి రమేష్, బుర్ర ప్రశాంత్, చాకలి అనిల్, మేకగూడెం శ్రీకాంత్, బేగరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జాతరను విజయవంతం చేయండి

**చేవెళ్ల నియోజకవర్గం మహనీయుల**
**ఉత్సవాల కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, వైస్ చేర్మెన్ బేగరి రాజు**



**చేవెళ్ళ ఏప్రిల్ 28(నినాదం):** ఈనెల 30వ తేదీన జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని చేవెళ్ల నియోజకవర్గం మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ బొర్రాన్ ప్రభాకర్, వైస్ చేర్మెన్ బేగరి రాజు, అన్నారు. మహనీయుల జాతరకు వాల్ పోస్టర్ ను మంగళవారం నాడు మొయినాబాద్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయులు ఆలోచన విధానాన్ని కొనసాగించాలని వారి ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు మహనీయులను స్మరించుకుంటూ వారి జయంతి కార్యక్రమాలు సందర్భంగా జరుపుకునే మహనీయుల జాతరలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు మహనీయులు చేసిన సేవలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల కోసం యువత పనిచేయాలని పిలుపునిచ్చారు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, మహనీయుల ఉత్సవాల కమిటీ చేవెళ్ల నియోజవర్గం వైస్ చైర్మన్ మాచనపల్లి రామస్వామి, మహనీయుల ఉత్సవాల కమిటీ నియోజకవర్గం కమిటీ నాయకులు పూలపల్లి వెంకటేష్,మొయినాబాద్ మండల మహనీయుల ఉత్సవాలు కమిటీ సలహాదారులు యండి అన్వర్ ఖాన్, ఎత్ బార్ పల్లి,మాజీ ఉపసర్పంచ్ మేకగూడెం బిక్షపతి, రజక సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షులు చాకలి వినోద్ కుమార్, ఎండి నూర్ భాయ్, సురేందర్ రెడ్డి, కావలి శ్రీనివాస్, యండి జాంగిర్ మహమ్మద్ ఇన్నోస్, సయ్యద్ ఇయ్య,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లారం విద్యుత్ సమస్యకు పరిష్కారం

**రూ. 25 లక్షల నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు**
**మంత్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల పాలభిషేకం**



**మల్హర్, ఏప్రిల్ 28 (నినాదం):** మండలంలోని మల్లారం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామస్తుల, రైతుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. గ్రామానికి, వ్యవసాయ రంగానికి ఒకే విద్యుత్ లైన్ ఉండటంతో ఇన్నాళ్లూ ఎదుర్కొంటున్న ఇబ్బందులకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవతో తెరపడనుంది. ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో రూ. 25 లక్షల నిధులను మంజూరు చేయించారు. మల్లారం సబ్ స్టేషన్ నుండి గ్రామానికి, వ్యవసాయ పంపుసెట్లకు ఒకే లైన్ ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు తీవ్ర అంతరాయం కలిగేది. ముఖ్యంగా వ్యవసాయ కనెక్షన్ల కోసం ఎల్.సితీసుకున్న సమయంలో గ్రామంలో కూడా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. దీంతో అటు రైతులు, ఇటు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని మండల మాజీ ఎంపిపి చింతలపల్లి మలహల్ రావు మాజీ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే కొత్త 11కెవి లైన్ ఏర్పాటుకు నిధులు కేటాయించారు. నిధులు మంజూరైన సందర్భంగా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. తమ సమస్యను గుర్తించి తక్షణమే స్పందించిన మంత్రికి ఈ సందర్భంగా రైతులు, ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్త లైన్ ఏర్పాటుతో నిరంతర విద్యుత్ సరఫరా అందుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ మేకల రాజయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి రాజు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగన్నపేట మురళి, యూత్ అధ్యక్షులు కలువల రవి సాగర్, నాయకులు లింగన్నపేట శేఖర్, రేవెల్లి లింగయ్య బలరాం తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం... రైతులు దిక్కుతోచని స్థితిలో

**అన్నదాతకు న్యాయం చేయాలి.. ధాన్యం తక్షణమే కొనాలి**
**ధాన్యం కొనకపోతే ఆందోళనలే మార్గం: బీఆర్ఎస్**



**అశ్వాపురం, ఏప్రిల్ 28 (నినాదం):** అశ్వాపురం మండలంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి దాదాపు నెల రోజులు అయినప్పటికీ సరైన చర్యలు చేపట్టకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ధాన్యం నాణ్యత తగ్గిపోతుండగా, రైతులు అధికారుల చుట్టూ తిరిగి విసుగెత్తిపోతున్నారని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని, అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి పరిమితంగా మాత్రమే అమలు చేస్తున్నారని విమర్శించారు. రైతుబంధు చెల్లింపులు కూడా పూర్తిగా జరగలేదని, మూడో విడత నిధులు ఎప్పుడు అందిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.గతంలో అకాల వర్షాలతో నష్టపోయిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం సరైన ధాన్యాన్ని కూడా కొనలేని పరిస్థితి నెలకొనడం విచారకరమని అన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని, లేని పక్షంలో గ్రామ గ్రామాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అన్నదాతకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ తాజా మాజీ అధ్యక్ష కార్యదర్శులు కోడి అమరేందర్,మర్రి మల్లారెడ్డి,మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జున రావు, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, బి ఆర్ ఎస్ మండల యువజన నాయకుడు గద్దల రామకృష్ణ, భూక్య చందూలాల్, చుంచు రామ్మూర్తి, చిలక వెంకటరామయ్య, శివారపు డాక్టర్ బాబు,గాడిద మహేష్, కాలువ సంసోన్, గొర్రె ముచ్చు వెంకటరమణ, మంద హుస్సేన్, గుంపెన శ్రీను పాల్గొన్నారు..

## మహిళా సర్పంచ్ భర్తల జోక్యం తగ్గించాలి

**ఉప సర్పంచుల ఫోరం**
**మండల అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్**



**భీమదేవరపల్లి ఏప్రిల్ 28 (నినాదం) :** గ్రామ పంచాయతీల్లో మహిళా సర్పంచుల భర్తలు అధికంగా జోక్యం చేసుకోవడం వల్ల మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం తగ్గుతోందని ముస్తఫాపూర్ ఉప సర్పంచ్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్ అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకట నలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 11 చోట్ల మహిళలు సర్పంచులుగా ఉన్నారని తెలిపారు. అయితే, ఎక్కువ గ్రామాల్లో మహిళా సర్పం చుల భర్తలు పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా స్వతంత్రం గా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో సిబ్బంది కూడా ఉప సర్పంచ్, వార్డు సభ్యులపై అధికారం చలాయించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గ్రామ సభల్లో ప్రశ్నించినప్పుడు మహిళా సర్పంచులతో పాటు వారి భర్తలు ఉప సర్పంచులు, గ్రామస్తులపై ఫిర్యాదులు చేయించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. మండల సర్పంచ్ ఫోరం సమావేశాల్లో మహిళా సర్పంచులు, ఉప సర్పంచుల మధ్య విభేదాలు పెరిగేలా మాట్లాడడం సరికాదని ఆయన అభిప్రాయ పడ్డారు. సర్పంచ్ ఫోరం చొరవ తీసుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా సర్పంచులు, ఉప సర్పంచుల మధ్య సఖ్యత నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## పేద జంటల పెళ్లికి అండగా 'దీ ఫౌండేషన్

**కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉండటమే నిజమైన తృప్తి:**
**దీ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్ రెడ్డి**





**కొమురవెల్లి ఏప్రిల్ 28(నినాదం):** నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో దీ== ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. కొమురవెల్లి మండలంలోని గురవన్నపేట గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద వధువుల వివాహానికి ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి మానవత్వంతో ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన వరుగంటి కిష్టయ్య-మనమ్మ దంపతుల కుమార్తె రాజేశ్వరి, అలాగే బచ్చల నరహరి-విజయ దంపతుల కుమార్తె కౌసల్య వివాహాలు నిశ్చయమయ్యాయి. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ కుటుంబాలు పెళ్లి జరిపించడానికి పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న రాజేందర్ రెడ్డి తక్షణమే స్పందించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని, ఒక్కో కుటుంబానికి 5,000 రూపాయల నగదు మరియు 25 కిలోల బియ్యం పంపిణీ చేశారు.ఈ సందర్భం గా దీ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేం దర్ రెడ్డి మాట్లాడుతూ ఎంత సంపాదిం చినా దొరకని సంతృప్తి, ఆపదలో ఉన్న పేదవారికి సాయం చేయడంలో లభిస్తుంది. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో మా వంతు చిన్న సహాయాన్ని అందించాం. భవిష్యత్తులో కూడా కష్టాల్లో ఉన్న వారికి మానవత్వంతో తోడుగా ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పేద కుటుంబాలకు అండగా నిలిచిన రాజేందర్ రెడ్డిని అభినందించారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం
29 ఏప్రిల్
2026

# పట్టుబట్టి సాధించారు.. రైతు కష్టాన్ని తీర్చారు!

ఫలించిన కార్పొరేటర్ శ్రావణి సాయి కుమార్ కృషి

సుజాతనగర్‌లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు పిలుపు

రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మేయర్, కార్పొరేటర్







**కొత్తగూడెం, ఏప్రిల్ 28 (నినాదం) :** రాజకీయ నాయకులు అంటే కేవలం హామీలు ఇవ్వడమే కాదు, ఇచ్చిన హామీని ఎలా నెరవేర్చాలో 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి సాయికుమార్ చేసి చూపించారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని రైతుల గోడు విని, అధికారులపై ఒత్తిడి తెచ్చి, ప్రభుత్వం నుంచి మొక్కజొన్న, ధాన్య కొనుగోలు కేంద్రం మంజూరు చేయించడంలో ఆమె చూపిన చొరవ అమోఘం. మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడంతో అటు రైతులు, ఇటు స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి చొరవతో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంతో సుజాతనగర్ మండల కేంద్రంలోని రైతుల నిరీక్షణ ఫలించింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా, మేయర్ మడ్ గణేష్, కార్పొరేటర్ శ్రావణి కలిసి తూకం (కాటా) ప్రక్రియను ప్రారంభించారు. మండల కేంద్రంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని శ్రావణి గారు చేసిన విన్నపానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను కోరిన వెంటనే సానుకూలంగా స్పందించి కేంద్రం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, ఎమ్మెల్యే కూనంనేనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులెవరూ దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం కల్పించిన ఈ కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, సొసైటీ బాధ్యులు, వ్యవసాయ మరియు రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, మండల రైతు సోదరులు మరియు హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మేయర్ కోలగాని శ్రీనివాస్

### స్మశానవాటికలో ఆశ్రయం పొందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచి సహాయం



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం) :** ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ గాండ్ల శ్రీకాంత్ కుటుంబానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భరోసా కల్పించారు. నివాసం లేక స్మశానవాటికలో ఆశ్రయం పొందుతున్న ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకుని మంగళవారం ప్రత్యక్షంగా వెళ్లి పరామర్శించారు. గాంధీనగర్‌లో అద్దె ఇంటిలో నివసిస్తున్న శ్రీకాంత్ మరణానంతరం ఇంటి యజమాని అనుమతించకపోవడంతో, కుటుంబ సభ్యులు పద్మానగర్ స్మశానవాటికలో తలదాచుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ అక్కడికి చేరుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి, పిల్లల విద్య కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో నాలుగు ప్రాంతాల్లో కర్మకాండ నిలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మశానవాటికల సమీపంలో అనువైన స్థలాలను గుర్తించి, అన్ని మౌలిక వసతులతో భవనాలు నిర్మించి అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి కేంద్రానికి సుమారు రూ.50 లక్షలు కేటాయించి త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అలాగే, అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాల్లో మరణం సంభవించినప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఎవరూ ఇబ్బంది పడకుండా ఈ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ రహదారుల సమీపంలోని స్మశానవాటికల వద్ద స్థలాల ఎంపికకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ అమలు చేస్తున్న "అంతిమయాత్ర అఖరి సఫర్" పథకంలో మార్పులు చేసి, పేద కుటుంబాలకు మరింత సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కరీంనగర్‌లో నివసిస్తూ మరణించిన నిరుపేదలకు, స్థానిక ప్రజాప్రతినిధి ధృవీకరణతో ఒక్క రూపాయికి అంత్యక్రియల సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తెల్ల లక్ష్మి రమేష్, అధికారులు లచ్చిరెడ్డి, గట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత జన్మదినం



**మునుగోడు, ఏప్రిల్ 28 (నినాదం):** ప్రముఖ ఉద్యమ పాటల గాయని తెలంగాణ కళా సమితి వ్యవస్థాపకురాలు తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత జన్మదినం నేడే ఆమె తెలంగాణలోని, ఉమ్మడి నల్గొండ జిల్లా. భువనగిరి లో29 ఏప్రిల్ 1974 జన్మించింది. ఆమె నిరుపేద కుటుంబంలో జన్మించిన ముద్దుల ఆడబిడ్డ. ఆమెకు ఒక అన్న బెల్లి కృష్ణ ... కృష్ణ కు తోబుట్టువు లో లలిత నడిపి చెల్లె వారిది అంతా ఉమ్మడి కుటుంబం కావున అంత సందడి సందడిగా ఉండేది. ఎప్పుడు చూసిన వాళ్ళ ఇంట్లో పండుగలా అనిపిస్తుండేది. ప్రాథమిక విద్య పూర్తికాకుండానే ఆగిపోయిన చదువుతో కుటుంబ భారాన్ని మోయడానికి లలిత భువనగిరి దగ్గర్లోని ఒక స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలుగా చేరింది. జీవన పోరాటంలో కార్మికురాలుగా పని చేస్తూ, తన చుట్టూ ఉన్న సమాజం గురించి చదివింది ఆమె, 28 ఏళ్లకే ఇద్దరు పిల్లలకు తల్లి అయింది. తన జీవితం నుంచి నేర్చుకున్న అనుభవాలు ఫ్యాక్టరీలోని కార్మిక సంఘం ఇచ్చిన చైతన్యం అన్ని కలిపి ఆమెను చైతన్య దీప్తి గా తీర్చిదిద్దాయి. సరిగా అప్పుడే భువనగిరి లో సాహితి మిత్రమండలి తన కార్యక్రమాలతో ప్రత్యామ్నాయ సాహితి రాజకీయ కృషిని ప్రారంభించింది. ప్రతి బుధవారం అధ్యయన తరగతులు, సాహిత్య సభలతో ప్రజలలో చైతన్యం నింపేందుకు కార్యాచరణను చేపట్టింది. సిఐటియు రివిజనిస్ట్ రాజకీయాల డొల్లతనాన్ని త్వరగానే తెలుసుకున్న లలిత.. నిజమైన ఉద్యమ కార్యాచరణను ఎన్నుకున్నది. ఆ క్రమంలో భువనగిరిలో నిత్య చైతన్య జ్వాలమై వెలిగింది. భువనగిరిలోని బస్తీలోని సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు ఉద్యమం చేపట్టింది. మహిళలను చైతన్యపరిచి. సంఘటితం చేసేందుకు మహిళ స్రవంతిని ఏర్పాటు చేసింది. మహిళ హక్కుల కోసం, యువతలో విరిగిపోయిన గుట్కా పాన్ పరాగ్. సారా లాంటి వ్యసనాలకు వ్యతిరేకంగా పాటలు కట్టి ఊరూరా ప్రదర్శన ఇచ్చింది. యువతలో చైతన్యం పెంచి సంఘటితం చేసి ఉద్యమానికి బాటలు వేసింది. భువనగిరిలో వ్యభిచార నిర్మూలన కమిటీ ఏర్పాటుచేసి కడుపు వృత్తికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాన్ని నడిపించింది. వ్యభిచార నరక కూపంలో మలిగిపోతున్న అమ్మాయిలను రక్షించి వారి తల్లిదండ్రుల దగ్గరికి చేర్చింది. ఎక్కడ ఏ సమస్య కోసం ప్రజలు పోరాడుతున్నారు అక్కడ ప్రత్యక్షమై తనదైన మాటలతో, పాటలతో ప్రజలను చైతన్యం చేసేందుకు జీవిత కాలం అంతా వేచింది. 1997 మార్చి జరిగిన మొట్టమొదటి దగా పడ్డ తెలంగాణా విజయవంతం చేయడంలో బెల్లి లలిత ముఖ్యపాత్ర పోషించారు. రాష్ట్రమంతా తెలంగాణ నినాదం గురించి చాట్ మాటుగా, గుసగుసగా చర్చించుకుంటున్న సందర్భంలో, మొట్టమొదటి బహిరంగ సభ ద్వారా తెలంగాణ నినాదానికి జీవం పోసిన కృషిలో బెల్లి లలిత పాత్ర ఎనలేనిది. భువనగిరి సభ మొదలు.. నాటి నుంచి. మెదక్, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాలో తెలంగాణ పాటకు పర్యాయ పదంగా మారింది బెల్లి లలిత. తెలంగాణ జన సభ కార్యక్రమంలో పాల్గొంటూనే. తెలంగాణ కళామండలి రాష్ట్ర కో- కన్వీనర్ గా బాధ్యతలు స్వీకరించి తెలంగాణ పార్టీ జీవితంలో పెంచుకున్నది. ఒక మాటలో చెప్పాలంటే.. తెలంగాణ ఉద్యమానికి జవ జీవాలు పోసింది బెల్లి లలిత. తన చుట్టూ ఉన్న సమాజంలోని సకల చెడులు, దురలవాట్లను, ఆమె పాట నిరసించింది. ప్రాంతీయ అసమానతలను ప్రశ్నిస్తూ.. పాలకులను నిలదీసిందామే. మొత్తంగా తనలాంటి శ్రామిక ప్రజలు, జాతి జనుల విముక్తి గీతాన్ని ఆమె గోంతెత్తి పాడింది. ఇది పాలకులకు కంటగింపు అయింది. రాజ్యం కక్షగట్టి కత్తి నూరింది. విముక్తి పాటలు పాడిన గొంతును తెగ నరికింది. కాలుకు గజ్జ కట్టి ఆట ఆడి పాట పాడినందుకు.. ఆడి పాడిన ఆ అవయవాలను ఖండ ఖండలుగా 17 ముక్కలుగా నరికింది రాక్షస రాజ్యం. 1999 మే 26 సాయంత్రం ఎప్పుడు లాగే తను పనిచేస్తున్న స్పిన్నింగ్ మిల్లు నుంచి ఇంటికి వచ్చి సాయంత్రం మరో గంటలో తిరిగి వస్తానని బయటకు వెళ్ళింది. అంతే రోజులు గడుస్తున్న ఆచూకీ లేదు, ఇంటికి తిరిగి రాలేదు. అప్పుడున్న ప్రభుత్వ నిర్బంధన, భువనగిరి లో ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ గాన కోకిల బెల్లి లలితకు రాజ్యం ఏదైనా అపాయం తలపెట్టవచ్చునని రాష్ట్రవ్యాప్తంగా అందరూ భయపడ్డారు. అరెస్టు చేస్తే ఆచూకీ తెలపాలని అన్ని ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు అప్పుడున్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అందరిని పలకరిస్తూ.. నిత్యం తమ కండ్ల ముందు తిరిగే బెల్లి లలిత ఏమైందో తెలుపాలని భువనగిరి ప్రజలు రోడ్డుపై కొచ్చి పాలకులను నిలదీశారు. బెల్లి లలిత అన్న బెల్లి కృష్ణ తనకున్న అనుమానాలతో కొందరు ప్రమేయం ఉందని వారి కుట్రకు బలి అయ్యే ప్రమాదం ఉందని వెంటనే తన చెల్లెలిని రక్షించాలని ప్రభుత్వాన్ని కోరాడు. తెలంగాణ జిల్లాల్లో బెల్లి లలిత ఆచూకీ తెలిపాలని ప్రజలు పెద్ద ఎత్తున కదలి ప్రదర్శనలు చేశారు. ధర్నా రాస్తారోకోలతో ప్రభుత్వ ధమన నీతిని ఖండించారు. ఆందోళనలు జరుగుతుండగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఒక నకిలీ లేఖను సృష్టించారు. దానిలో ఆకుకు అందని పోకకు పొందని కాకమ్మ కథలు రాశారు. ఆ లేఖ సారాంశం మొత్తం లలిత వ్యక్తిత్వాన్ని కీచపర్చే విధంగానే ఉండడంతో అది నకిలీ లేక అని ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును అనుమానించారు. ఇంతలో నాలుగో రోజు భువనగిరి తూర్పు భాగాన ఉన్న దర్గా... సమీపంలో ఉన్న వ్యవసాయ బావులలో మానవ శరీర భాగాలు నీటిపై తేలియాడుతున్నాయని ప్రచారం జరిగింది. అంతే భువనగిరి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అనుమానించినంత ఘోరం జరిగిందని భువనగిరి విలవిలలాడింది. లలితను కుట్రపూరితంగా ప్రభుత్వమే హత్య చేయించిందని ప్రజలంతా ఆరోపించారు. అయిన ప్రభుత్వం శరీర భాగాలను ప్రజలకు చూపకుండా బెల్లి లలిత వి కావని బుకాయించింది. లలిత ఎక్కడికో నక్సలైట్ దళంలోకి వెళ్లి ఉండవచ్చునని, ప్రజలను తప్పుదో పట్టించే ప్రయత్నం చేసింది. బెల్లి లలితను ముక్కలు ముక్కలుగా నరికి చంపవలసిన అవసరం లేదని, చంపాలనుకుంటే బహిరంగంగా ఎన్కౌంటర్ చేస్తాం గదా అని అప్పటి జిల్లా పోలీసు అధికారి ప్రకటించారు. అసలు శరీర భాగాలు ఎవరివో తేలాల్సి ఉందని, చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడి, నిందితులకు ప్రభుత్వం కొమ్ము కాస్తున్నదని, విమర్శలు రావడంతో, చివరికి ఇద్దరు అనుమానితులను తెర మీదికి తెచ్చారు. ఆ ఇద్దరు చేత అనేకమైన అసత్యాలు చెప్పించారు. ఈ మొత్తం వ్యవహారంలో బెల్లి లలిత వ్యక్తిత్వాన్ని కి మసి పూసేందుకు ప్రభుత్వం అప్పటి హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి కూడా ప్రయత్నించాడు. అక్రమ సంబంధాలు ప్రేమ వ్యవహారాలు వ్యక్తిగత పక్షులతో లలితను విరోధులు చంపారని చెప్పడానికి ప్రభుత్వం పడరాని పాట్లు పడింది. కానీ బెల్లి లలిత జీవితం వ్యక్తిత్వం తెలిసిన వారు ఎవ్వరూ ప్రభుత్వ దుర్మార్గ ప్రచారాన్ని నమ్మలేదు. నమ్మకపోగా ఒక ఆడ కూతుర్ని కిరాతకంగా ముక్కలు ముక్కలుగా నరికి చంపి అపనిందలు వేస్తున్నారని ప్రజలంతా ఈసరించుకున్నారు. బెల్లి లలితను హత్య చేసి తెలంగాణ నినాదాన్ని, వాదాన్ని రూపుమాపవచ్చు అని పాలకులు కుట్రపూరితంగా హత్య చేశారు. దుర్మార్గనంతాం కొంతమంది వ్యక్తులపై నెట్టేసి తన చేతుల రక్తపు మరకలను దాచుకునేందుకు అప్పుడున్న ప్రభుత్వం ప్రయత్నం చేసింది. కొంతమంది అమాయకంగా ఇది నిజమేనని నమ్మారు కూడా, కానీ ఇది పచ్చి అబద్ధం ఇది రాజ్యం చేసిన హత్య. రాజ్యం కొంతమందిని ఆయుధాలుగా వాడుకొని వారితో చేయించిన హత్యాని నెమ్మదిగా ప్రజలు తెలుసుకున్నారు. పాలకుల కుట్రను ఓడించారు. బెల్లి లలిత గొంతు ను తెగ నరికి తెలంగాణ పాటను ఆపడానికి ఆపమని కలగన్న పాలకులకు కోట్ల గొంతుకలో తెలంగాణ పాట హోరెత్తుతున్నది. వలస పాలకులు పారిపోక తప్పని పరిస్థితి తెస్తున్నది. ఇదంతా బెల్లి లలిత త్యాగాలలోనించి వచ్చిన వారసత్వమే. బెల్లి లలిత జీవితం, త్యాగం ఒక ఎత్తు అయితే, ఆ కుటుంబం పై జరిగిన దాడి, హింస భయంకరమైనది. బెల్లి లలిత చెల్లె భర్త ముక్క కరుణాకర్, అక్క భర్త శ్రీరాములు ను అతి కిరాతకంగా హత్య చేయించింది అప్పటి ప్రభుత్వం. ఒకే ఇంట్లో ముగ్గురిని బలి తీసుకున్న రాక్షస రాజ్యం . ఆ రక్తదాహానికి పచ్చని గూడు కకావికలం అయ్యింది. మే 26 బెల్లి లలిత వర్ధంతి కావున ట్యాంక్ బండ్ మీద ఆమె విగ్రహం పెట్టాలని తెలంగాణ ప్రజానీకం కోరుతున్నారు.

# మేడే పోస్టర్ విడుదల

141వ మేడేను జయప్రదం చేయాలి

కార్మిక హక్కులను కాపాడాలి

ఏఐటీయూసీ జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి ఎండి ఉస్మాన్



**మెట్‌పల్లి, ఏప్రిల్ 28 (నినాదం):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా 141వ మేడే పోస్టర్ ను, పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద, మంగళవారం ఏఐటీయూసీ జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ఎండి ఉస్మాన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన చారిత్రక పోరాటానికి గుర్తుగా మేడేను ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ పోరాటం కార్మికుల హక్కులు, సంక్షేమం, సమాన వేతనం కోసం సాగి ప్రపంచ కార్మిక ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్లు కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కోడ్ల వల్ల పని గంటలు పెరిగే ప్రమాదం ఉందని, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరిగి శాశ్వత ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే ట్రేడ్ యూనియన్ల హక్కులు పరిమితం అవుతాయని, కార్మికులకు లభించే భద్రత, సంక్షేమ ప్రయోజనాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులను కాపాడుకోవచ్చని అన్నారు. ముందస్తు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. మేడే స్ఫూర్తిని కొనసాగిస్తూ పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొని మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఏ. అనిల్, ఉపాధ్యక్షుడు యు. శ్రీను, కోశాధికారి లంక సందీప్‌తో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



**బోధన్ రూరల్, ఏప్రిల్ 28 (నినాదం) :** బోధన్ పట్టణంలో ఈనెల 30న ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్సీ ఎస్టీ హక్కుల పరిక్షణ కమిటీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు నీరడీ ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈనెల 30న సాయంత్రం 4 గంటలకు సభ జరుగుతుందన్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని బహుజనుల ను జాగృతం చేసి మహనీయుల జయంతోత్సవాలను ప్రతి ఏడాది అనావయితిగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రజా కవి, వాగ్గేయ కళాకారులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, బొంబాయి వారిచే అమ్మ, సామ్మ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ జయంతి ఉత్సవాలకు బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సి ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ గౌరవ అధ్యక్షులు పరిమి కోటేశ్వరరావు, కో కన్వీనర్స్ సింగడే పాండు, నీరడి రవి, కమిటీ సభ్యులు దాసరి శ్యామ్, రాహుల్, అలోక్, విట్టల్, అంబేద్కర్ సంగం నాయకులు సరేడే యాదు, డిస్కో సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# కర్మకాండ నిలయాల ఏర్పాటు ప్రతిపాదన

పేదలకు ఊరట కలిగించేలా నాలుగు దిశల్లో ఆధునిక సదుపాయాలతో భవనాల నిర్మాణం

స్మశాన వాటికలకు అనువైన స్థలాలను పరిశీలించిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్

నాలుగు చోట్ల భవనాలను నిర్మించాలని మున్సిపల్ పాలకవర్గానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన



**కరీంనగర్, ఏప్రిల్ 28(నినాదం) :** కరీంనగర్‌లో కిరాయి ఇళ్లలో నివసించే కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని కర్మకాండ నిలయాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యుడు మరణించిన తర్వాత కర్మకాండలు పూర్తయ్యే వరకు ఇళ్లలో ఉండేందుకు అనుమతి లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఉపశమనం కలిగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచనల మేరకు కరీంనగర్ మున్సిపల్ పాలకవర్గం నగరంలోని నాలుగు దిశల్లో కర్మకాండ నిలయాలను నిర్మించాలని నిర్ణయించింది. స్మశాన వాటికల సమీపంలో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు నగరంలోని పలు స్మశాన వాటికలను పరిశీలించి అనువైన స్థలాలను గుర్తించారు. స్థలాల ఎంపిక పూర్తయిన వెంటనే ఒక్కో భవనాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి కర్మకాండ నిలయంలో విద్యుత్, తాగునీరు, నివాస సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించబడతాయి. కుటుంబాలు గరిష్టంగా 13 రోజులపాటు అక్కడే ఉండే అవకాశం ఉంటుంది. నిర్వహణ కోసం ప్రజలపై భారంగా కాకుండా స్వల్ప రుసుం విధించే అంశంపై కూడా పరిశీలన కొనసాగుతోంది. త్వరలోనే స్థలాల ఎంపిక పూర్తిచేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామని మేయర్ తెలిపారు. ఈ ఏర్పాట్లు అమలులోకి వస్తే పేద కుటుంబాలకు గణనీయమైన ఊరట లభించనుంది.

# వాహనాలకు బ్లాక్ ఫిలిం వేస్తే... కేసులు నమోదు చేస్తాం.

### జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్



**జవహర్ నగర్, ఏప్రిల్ 28(నినాదం):** వాహనాలకు బ్లాక్ ఫిలిం వేస్తే కఠిన చర్యలు తప్పవని, అడ్డగోలుగా సైరన్ మోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాలను గుర్తిస్తూ కేసులు నమోదు చేస్తున్నామని జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. మల్కాజిగిరి ట్రాఫిక్ జోన్ పరిధిలోని ట్రాఫిక్ 1 డీసీపీ రాహుల్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ సీఐ శివశంకర్ సమక్షంలో పలు వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నబ్లాక్ ఫిలింపై మంగళవారం ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్మాట్లాడుతూ బ్లాక్ ఫిలింలతో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. 40 వాహనాలకు బ్లాక్ ఫిలింలను తొలగించాలని తెలిపారు. అనధికార వాహనాలకు స్టిక్కరు వేస్తే కటకటాలోకి వెళ్తారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమీక్ష..



**హైదరాబాద్, ఏప్రిల్ 28(నినాదం) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ కుమారి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఎల్ఏ, డివిజన్ కమిటీ ల నియామకంపై చర్చించారు. అసెంబ్లీ కోఆర్డినేటర్లు వారికి కేటాయించిన అసెంబ్లీలో బీఎల్ఏ, డివిజన్ అధ్యక్షులు ప్రతిపాదనలను పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి సమర్పించారు. అలాగే త్వరలో రాబోయే జిహెచ్ఎంసి ఎలక్షన్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు ఏఐసిసి తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్ సూచనలను కోఆర్డినేటర్లకు జిల్లా అధ్యక్షులకు పార్లమెంట్ ఇన్చార్జికి సూచించారు. ఈ సమావేశంలో నూతనంగా హైదరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా నియమించబడిన మాజీ మంత్రి సంబని చంద్రశేఖర్, టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఖాలీద్ సైఫుల్లా, హైదరాబాద్ పార్లమెంట్ లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ, డివిజన్ కమిటీ నియామకానికి నియమించబడిన కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం, తెలంగాణ
29 ఏప్రిల్ 2026


# బంకుల్లో బారులు తీరిన వినియోగదారులు

### బంకుల్లో దర్శనమిస్తున్న నో స్టాక్ బోర్డులు

### పెట్రోల్ డీజిల్ కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్న వినియోగదారులు



**హనుమకొండ, ఏప్రిల్ 28, (నినాదం):** నగరంలో మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరత వెక్కిరిస్తోంది. కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు, మరి కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉన్న కారణంగా వినియోగదారులు ఎగబడుతున్నారు. ఇంధన సంక్షోభానికి ప్రధాన కారణమైన ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం దాదాపుగా ముగిసి కొరత లేకుండా సరఫరా కొనసాగుతున్న నేపథ్యంలో మరోసారి పెట్రోల్ డీజిల్ కొరత ఎందుకు ఏర్పడిందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. పైగా బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండడంతో ధరల పెరుగుదలే కారణమా అంటూ వినియోగదారులు పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడక ముందే నిలువ చేసుకోవాలని బంకుల ముందు బారులు తీరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం, మంగళవారం రెండు రోజుల నుండి పెట్రోల్,డీజిల్ బంకులలో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కాగా మిగతా చోట్ల పెట్రోల్ ఉంటే డీజిల్ లేకపోవడం, డీజిల్ ఉంటే పెట్రోల్ లేకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంధన కొరత వల్ల ప్రధాన రహదారుల వెంట రోడ్లపై నిలిచిపోయిన వాహనాలే సాక్ష్యాలుగా నిలిచాయి. దీంతో ట్రాఫిక్ రోడ్ల వెంట అంతరాయం కలుగుతుంది. కొన్ని చోట్ల దాదాపు నాలుగు రోజుల నుంచే నో స్టాక్ బోర్డులు దర్శన ఇస్తున్నాయని వినియోగదారుల ఆరోపిస్తున్నారు. ఈ కొరత విషయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇది కృత్రిమ కొరతగా వినియోగదారులు భావిస్తున్నారు. జిల్లాలో మరోమారు డీజిల్,పెట్రోల్ కొరత ఏర్పడడంతో వినియోగదారులు అవసరాన్ని మించి కొనుగోలు చేస్తున్నారని తెలుస్తుంది. ప్రధానంగా డిజిల్ కొరత ఏర్పడిందనే పుకార్ల నేపథ్యంలో వాహనదారులు గంటల తరబడి నిరీక్షించి అవసరానికి మించి డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో సగం బంకులల్లో బంకు యజమానులు నో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేశారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వచ్చిన ట్యాంకర్ వచ్చినట్టే అయిపోతుండడంతో బంకుల నిర్వాహకులు మరో ట్యాంకర్ వచ్చేంత వరకు వేచి చూడాల్సిందేనని వినియోగదారులకు స్పష్టం చేస్తున్నారు. డీజిల్ బుక్ చేసినప్పటికీ డీజిల్ ట్యాంకర్ రెండు మూడు రోజులకు గాని రావడం లేదని బంకుల యజమానులు పేర్కొంటున్నారు. సాధారణ డిమాండ్ ప్రకారం ఒక ట్యాంకర్ అయిపోయే సమయానికి మరో ట్యాంకర్ వస్తుందని కానీ ఒక్కసారిగా వినియోగదారులు ఎ గబడడంతో స్టాక్ అయిపోయేంత సేపు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. మళ్లీ ట్యాంకర్లు రాగానే విక్రయాలు జరుపుతున్నామని యజమానులు చెబుతున్నట్లు వినియోగదారులు స్పష్టం చేస్తున్నారు. పెట్రోల్ డీజిల్ కొరతలో భాగంగా బంకుల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? లేక డీలర్లకు సరైన సమయంలో డబ్బులు చెల్లించకపోవడమే పెట్రోల్, డీజిల్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందా అనే ఆరోపణలు వినియోగదారుల ద్వారా స్పష్టమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందనీ వినియోగదారులు సూచిస్తున్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు



**అల్వాల్, ఏప్రిల్ 28(నినాదం):** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావును కలిసి వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ రాంచందర్ రావు చేతుల మీదుగా కార్ అండ్ బైక్ స్టిక్కర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి మాధవ్, కె. శ్రీనివాస్ వర్మ, మాణిక్య రెడ్డి, బిజెపి నాయకులు ఉష, సూర్య, రవి, ప్రహ్లాద్, సాయి, సన్నీ, నాగేందర్, మహేందర్ పాల్గొన్నారు.

## వి కోటలో విలేఖరి దారుణ హత్యపై జర్నలిస్టుల ఆందోళన



**వికారాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** ఆంధ్రప్రదేశ్‌లోని వి కోటలో విలేఖరి జగన్మోహనరెడ్డి దారుణ హత్య ఉదాతం పై పలువురు జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. కారణాలు ఏవైనా పాశవీకంగా నరికి చంపడం జర్నలిస్టులను కలవర పెడుతోందని అన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు దాని మూలాలను కనుగొని సమరస్య పూర్వకంగా పరిస్కారం చేసుకోవాలని అన్నారు. వృత్తి గతమైన, లేదా వృత్తి పరమైన సమస్య ఏదైనా ఇంతటి దారుణనికి వడిగట్టడం దురదృష్ట కరమని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ వృత్తిలో నేటికి నిజాయితీ గా పనిచేసేవారు అనేకమంది ఉన్నారని వారు నేడు ఆత్మరక్షణలో పడే విధంగా దారుణాలు జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. జర్నలిజం అనేది ఒక వ్యసనమని అందులోనుండి రావాలంటే కొంత ఇబ్బందికరమని అన్నారు. కొందరు కుటుంబాలు ఏమైపోయినా వృత్తి మీద పెంచున్న ఇష్టాన్ని వదులుకోలేక ఉండి ఆర్థికంగా ఎదగలేక ఊసురు మంటూ కాలం వెల్లడిస్తున్న వారులేకపోలేదని ఈ నేపథ్యంలో విలేఖరులపై దాడులు, హత్యలు జరుగుతుంటే వృత్తిని నమ్ముకుని కొనసాగే వారు భయాందోళనకు గురైయ్యే ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కొందరు జర్నలిస్టులు వాపోయారు. జర్నలిస్టులు కొందరు ప్రభుత్వ ఉద్యోగి కంటే అధిక కాలం నిజాయితీగా సేవలందిస్తున్న వారు ఉన్నారని ఈ దారుణాలు చూసి జర్నలిజం పై విసుగు పుడితే ప్రజల గొంతుక వినిపించే నాలుగవ మూల స్థంభం మీడియా ఉండకపోతే ప్రజల సమస్యలు పట్టించుకునే నాథుడు లేని సమాజాన్ని ఊహించలేమని సినీయర్ జర్నలిస్టులు అన్నారు. ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించి వి కోట విలేఖరి హత్యపై ఏలాంటి పక్షపాతం లేకుండా దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## మహనీయుల జాతరను విజయవంతం చేయండి



**వికారాబాద్, ఏప్రిల్ 27(నినాదం):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 30 న నిర్వహించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబా పూలే, బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల జాతర కార్యక్రమానికి చెందిన గోడ పత్రికను మంగళవారం నవాబుపేట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు మాట్లాడుతూ మహనీయుల జాతరకు వేలాదిగా అభిమానులు తరలి రావాలని మహనీయులకు ఘననివాళి అర్పించాలని కోరారు. స్థానిక అంబేద్కర్ యువజన సంఘం, పలు దళిత సంఘాలు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా నిర్వాహహిస్తున్న ఈ మహాత్కార్యానికి స్వచ్చందంగా హాజరై అభిమానాన్ని చాటుకోవాలని కోరారు. ఈ జాతరకు విశిష్ఠ వక్తలు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు హాజరు కానున్నారని వేలాదిగా అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర్, మాజీ సర్పంచులు తిరుపతి రెడ్డి, రత్నం, పర్మయ్య, దళిత నాయకులు ప్రభాకర్, ఆనందం, శివరాజ్, జాన్, ప్రభావతి, అక్షర, శ్యామ్, రవికుమార్, కిష్టయ్య, పద్మారావు, అంజయ్య, రాచన్న, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గృహిణి అదృశ్యం

### పిఎస్‌లో ఫిర్యాదు చేసిన భర్త



**జవహర్ నగర్, ఏప్రిల్ 28 (నినాదం):** గృహిణి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత గబ్బిలాల పేటలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం పాత గబ్బిలాల పేట అంబేద్కర్ నగర్ కు చెందిన బొత్తుల శ్రీనివాస్ భార్య మల్లేశ్వరి ( 19) దంపతులు గబ్బిలాల పేటలోని శ్రీ శ్రీ జ్ఞాన మందిర్ స్కూల్ దగ్గర నివాసమంటున్నారు. ఈనెల 26వ తారీఖున మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనివాస్ పనిమీద ఇంటి నుండి బయటకు వెళ్లగా ఆ సమయంలో మల్లేశ్వరి ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు.రాత్రి 11 గంటలకు శ్రీనివాస్ తిరిగి ఇంటికి రాగా భార్య మల్లేశ్వరి కనపడలేదు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికిన బంధువుల వద్ద వెతికిన తెలిసిన వారి వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు శ్రీనివాస్ భార్యకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఈ మేరకు శ్రీనివాస్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లక్ష్మీనరసింహస్వామి వారికి పరమపద ఉత్సవం



**హుజూర్‌నగర్, ఏప్రిల్ 28 (నినాదం):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు మంగళవారం శ్రీ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవములు–2026 సందర్భంగా అధ్యయన ఉత్సవములో భాగంగా మూడవ రోజు పరమపద ఉత్సవము పూజ కార్యక్రమములు దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభా చార్యులు, కుమ్మరికుంట్ల బదరీనారాయణచార్యులు, సంపన్ముడుంబై అనంతాచార్యులు, మార్తి లక్ష్మీనరసింహమూర్తి, నరసింహాచార్యులు, వారలచే నిర్వహించబడినవి. ఇట్టి కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయకుమార్, కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి వారలు పాల్గొన్నారు.

## మహిళల సాధికారతే లక్ష్యంగా శిక్షణ కేంద్రాల ఏర్పాటు

- ఒక్కొక్క భవనానికి రూ 10 లక్షలు
- జిల్లాలో 75 భవనాలకు రూ.7.50 కోట్ల నిధులు మంజూరు



**హనుమకొండ,ఏప్రిల్28,(నినాదం):** స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాకు రు 7.50 కోట్లను మంజూరు చేసింది.ఈ పోటీ ప్రపంచంలో పురుషులకు దీటుగా మహిళలు వ్యాపార, వాణిజ్య రంగాలలో రాణించాలని సదుద్దేశంతో ఉపాధి యూనిట్లతో పాటు సంఘాల అభివృద్ధి అంశాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే మహిళలకు మండల స్థాయిలో సరైన శిక్షణ కేంద్రాలు లేకపోవడంతో జిల్లా కేంద్రాల్లో నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరవుతూ ఇబ్బందులు పడుతున్న మహిళలను గుర్తించి ప్రభుత్వం మండల కేంద్రాల్లోనే శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు కార్యచరణ రూపొందించింది. అందులో భాగంగానే వీబీజీ రామ్ (జాతీయ ఉపాధి పథకం) ద్వారా తొలుత రూ 75 భవన నిర్మాణాలకు నిధులను మంజూరు చేసింది. ఒక్కొక్క భవనానికి 200 గజాల స్థలంలో రూ 10 లక్షల చొప్పున రూ 7.50 కోట్లను కేటాయించింది. నూతనంగా నిర్మించే భవనాల్లో సుమారు 50 మంది మహిళలు విశాలంగా కూర్చునే విధంగా నిర్మాణాల బాధ్యతలను ఐకేపీ,ఏపీఎంలు, కార్యదర్శులు,జేపీఓ లకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. వీటితో పాటు అదనంగా మరో మూడు వర్క్ షెడ్లను కూడా నిర్మాణం చేపడుతున్నారు. ఒక్కొక్క షెడ్డుకు రూ 10లక్షల చొప్పున రూ 30 లక్షల రూపాయలను కేటాయించారు. భవనాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రొజెక్టర్లు, మైకులు, సౌండ్ బాక్స్‌లు, కుర్చీలు తదితర సామాగ్రిని సమకూర్చడంతో పాటు భవనాలకు రంగులు వేసేందుకు ప్రభుత్వం మరో రూ 5లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిసింది.

**శిక్షణ కేంద్రాన్ని అద్దెకు ఇచ్చే వేసులుబాటు**

శిక్షణ కేంద్రాలను ఇతరులకు అద్దెకు ఇచ్చే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించింది. మహిళలకు శిక్షణ తరగతులు లేనప్పుడు అద్దెకిచ్చే బాధ్యతలను ఏపీఎంలకు అప్పగించారు. ఈ క్రమంలో అద్దెకు ఇవ్వడం వల్ల మండల సమాఖ్యలకు అదనపు ఆదాయం సమకూర్చనుందనీ అధికారులు పేర్కొంటున్నారు.

**లిజిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాలు**

గ్రామ సమైక్యలు 397.
స్వయం సహాయక సంఘాలు 11007.
సభ్యులు 1,14, 426 మంది ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ఇచ్చిన హామీల అమలు కోసం మాస్ లైన్ పార్టీ శ్రేణులు కార్యాచరణకు సిద్ధం కావాలి
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.జీ రామచందర్




**అమరచింత, ఏప్రిల్ 28, (నినాదం):** ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ కే.జీ రామచందర్ ఆరోపించారు. మంగళవారం అమరచింతలోని మార్క్స్ భవన్ లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జనరల్ బాడీకి అధ్యక్ష వర్గంగా సిపిఐఎంఎల్ మాసలైన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ హనుమంతు సాంబశివుడు వహించగా ముఖ్య వక్తలుగా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎం కృష్ణ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైనారని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వడంలో నిరుద్యోగ భృతి కల్పించడంలో రైతులకు ఎంఎస్పీ ధర కల్పించడంలో నాణ్యమైన విత్తనాలు ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అధిపతి లకు ఊడిగం చేస్తూ ఉన్న సంపాదన వారికి అప్పనంగా అప్పజెప్తూ ధనవంతులను ఇంకా ధనవంతులుగా చేస్తూ పేదలను మరింత పేదలుగా మారుస్తూ ఈ ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కుతున్నాయని మండిపడ్డారు.ప్రజా సమస్యలను అమలు చేయాలని నిలదీస్తే ప్రజా నాయకుల పై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అంతేకాదు రైతులకు కూలీలకు వసతులు కల్పించడంలో కేంద్ర సర్కారు విఫలమైందని ఆరోపించారు.దేశంలో కులాన్ని మతాన్ని పెంచి పోషించి వారు రాజకీయాలకు వాడుకుంటున్నారు.తెలంగాణ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినప్పటికీ వాటిని సంపూర్ణంగా అమలు చేయడం లేదు రైతుబంధు సరియైన సమయంలో ఇవ్వకపోగా కోతలు పెడుతున్నారు

**రైతుబంధు పది ఎకరాల లోపు అందరికీ ఇవ్వాలి**

వ్యవసాయ కూలీలకు పని కల్పించాలిమహిళలకు 2500 రూపాయల చెల్లించే హామీ అమలు కాలేదు. ఉచిత కరెంటు స్కీం నత్త నడకన కొనసాగుతుంది వృద్ధుల వృద్ధుల వికలాంగుల వితంతుల ఒంటరి మహిళల పింఛన్ల పెంపు నేటికీ అమలు కాలేదు నిరుద్యోగ భృతి అమలు చేయడం లేదు దేశంలో రాష్ట్రంలో సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలను పెంచాలి వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు ప్రసాద్ గణేష్ రాజన్న మసలమని తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలతో సహా ఉరి వేసుకొని ఆత్మహత్య



**తొర్రూరు, ఏప్రిల్ 27(నినాదం):** ఇద్దరు పిల్లలకు ఉరివేసి తానూ ఉరి వేసుకున్న సంఘటన తొర్రూర్ పట్టణ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర గుంశావలి అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై, తన ఇద్దరు కొడుకులను ఉరివేసి అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. మృతులు అమ్మపురం గ్రామానికి చెందిన తండ్రి కిన్నెర గుమ్ షావలి (35) ఇద్దరు పిల్లలు విలష్ (05) వికేష్ (03) గా గుర్తింపు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే తొర్రూర్ సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న కాలీశ్వర్ పొలంలోని వేప చెట్టుకు ముగ్గురూ ఉరివేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాలను కిందికి దించి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమై ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ : ఎస్సై పవన్ కుమార్



**మహదేవపూర్ ఏప్రిల్ 28, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కనిపించకుండా పోయిన పిల్లలను గుర్తించి రక్షించు వారి కుటుంబాలకు చేర్చే ఆపరేషన్ స్మైల్, అనాథలు భిక్షాటనలో ఉన్న బాలా కార్మిక వ్యవస్థలో చిక్కుకున్న చిన్నారులను రక్షించి పునరావసం కల్పించే ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యాలు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల పిల్లల విద్య ఆరోగ్యం భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలను, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని ఆయన సూచించారు. సమాజంలో పిల్లల భద్రత విద్య సంక్షేమ కోసం పోలీస్ శాఖ తో పాటు ప్రజల సహకారం అత్యంత అవసరమని ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం పోలీస్ శాఖకు అందజేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎస్సై సాయి శశాంక్, ఐసిడిఎస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## చికాగో అమరవీరుల స్ఫూర్తితో 8 గంటల పని దినాలకై పోరాటం కొనసాగిద్దాం

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి




**అమరచింత, ఏప్రిల్ 28, (నినాదం):** ఎనిమిది గంటల పని దినం కోసం 1886లో అమెరికాలోని చికాగో నగరంలో అమరవీరులు చేసిన పోరాటాన్ని నేటి కార్మికులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి శ్రీహరి అన్నారు. 141వ మే డే ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఏఐటీయూసీ నాయకులతో కలిసి మేడే ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886లో కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండానే మేడే ఉత్సవాల్లో ఎగరవేస్తున్నామని ఆయన అన్నారు. మేడే ఉత్సవాలు ఏఐటియుసి ఆధ్వర్యంలో వాడవాడల జిల్లా కేంద్రాలలో రాష్ట్ర ఆల్ ఇండియా స్థాయిలో ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అప్పుడు కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలరాస్తూ 12 గంటలు కార్మికులతో పని చేయించుకుంటుందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోర్సు తెచ్చి కార్మికుల నడ్డి విరిచిందని ఆరోపించారు. మళ్లీ 8 గంటల పని దినం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు కాదు రాస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రయత్నాలను అడ్డుకునేందుకు కార్మికులు పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక ప్రయత్నాలు అడ్డుకునేందుకు ఏఐటి యుసి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను పోరాటాల ఉత్సవాలుగా మార్చుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మోష భాస్కర్, శ్యాంసుందర్, రవీందర్, రఘు, లక్ష్మీనారాయణ, ఇజ్రాయిల్ తోపాటు పలువురు పాల్గొన్నారు,

## మేడేను వాడవాడల ఘనంగా జరుపుకోవాలి

### ఏఐటిసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్




**హుజూర్ నగర్, ఏప్రిల్ 28 (నినాదం):** మేడే ను వాడవాడలా ఘనంగా జరుపుకోవాలని ఏఐటిసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు . మంగళవారం హుజూర్నగర్ లోని సిపిఐ ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల సమావేశం ఇందిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల పండగ రోజు అయిన మే1న మేడే ఉత్సవాలు ఘనంగా వాడవాడలో కార్మికుల అడ్డాల వద్ద ఎర్రజెండాలు ఎగురవేసి ర్యాలీలు ప్రదర్శన లోపాల్గొనాలని కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలు నాలుగు కోడులుగా విభజించి చట్టం చేసిందని మేడే స్ఫూర్తితో అన్ని కార్మిక సంఘాలు ఏకమై తమ హక్కుల కోసం సమరసియుల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లావుల రాములు మాట్లాడుతూ 1886లోఅమెరికా దేశం చికాగో నగరంలో ఎట్టి చాకిరి బానిసత్వం నుండి విముక్తి కోసం ఎనిమిది గంటల పని దినం కోరుతూ కార్మికులు విరోచిత పోరాటాలు చేశారు ఆనాడున అమెరికా ప్రభుత్వం జరిపిన కాల్పు లువేలాదిమంది కార్మికులు ప్రాణాలర్పించారని వారి రక్తంతో తడిసిన చొక్కాని ఎర్రజెండాగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక జెండాగా నాటి నుండి నేటి వరకు స్ఫూర్తి నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు సూర్యాపేట జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జెట్టి ప్రసాదు ఎలక్ట్రికల్ యూనియన్ హుజూర్నగర్ కార్యదర్శి దగ్గుబాటి సత్యానందం సివిల్ సప్లై యూనియన్ మేస్త్రి బెల్లంకొండ రామ్మూర్తి రామిశెట్టి సుబ్బారావు పంకజ్.రమేష్ శివ జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవ గుర్తింపునకు విశిష్ట అవార్డు



**అల్వాల్, ఏప్రిల్ 28 (నినాదం):** బల్లెం వేణుమాధవ్ ఆర్ట్ థియేటర్, వారు సామాజిక సేవకు గుర్తింపుగా విశిష్ట అవార్డు తో సన్మానం చేశారు. సినీ యాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా , ఫిలింనగర్ హైదరాబాద్.సోమవారం ఈ అవార్డు అందుకున్నారు.

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 29 ఏప్రిల్ 2026


## ఉద్యోగుల చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సెలింగ్



**మంచిర్యాల, ఏప్రిల్ 28(నినాదం):** శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉద్యోగుల క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే క్వార్టర్లు కలిగి ఉన్న వారికి చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. నస్పూర్ , గోదావరి కాలనీ, ఆర్కె 6 కాలనీ, టీచర్స్ కాలనీ, సీసీసీ టౌన్షిప్, కృష్ణకాలనీ, శ్రీరాంపూర్ కాలనీ , ఆర్కె 8 కాలనీ లో ఖాళీగా ఉన్న 416 క్వార్టర్లకోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. 416 క్వార్టర్లలో 83 మంది ఉద్యోగులు తమకు నచ్చిన క్వార్టర్లను ఎంచుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ , ఏరియా ఇంజనీర్ రమణ రావు, డీజీఎం(సివిల్) ఆనందర్ కుమార్, డీజీఎం(పర్సనల్) . అనిల్ కుమార్, సీనియర్ పీఓ ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డిని కలిసిన అల్లే లావణ్య



**బోధన్ రూరల్ (నినాదం):** తెలంగాణ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ గా నియమితులైన అల్లే లావణ్య రమేష్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.

## చలివేంద్రాలు ప్రారంభం,ప్రజలకు ఉపశమనం

### -ఎల్బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్ బినగర్, నినాదం:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు, శీతల పానీయాలు అందించేందుకు మంగళవారం నాగోల్ డివిజన్ భారస పార్టీ యువ నాయకులు పోచంపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సాయినగర్ కాలనీ, నాగోల్ రిలయన్స్ ఫ్రెష్, జైపూరి కాలనీ,ఆనంద్ నగర్ చౌరస్తా లతో పాటు పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సాయి నగర్ వద్ద చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం ద్వారా రోజువారీగా ప్రయాణించే ప్రజలు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, పాదచారులకు చల్లని తాగునీరు,మజ్జిగ వంటి పానీయాలు ఉచితంగా అందించబడతాయన్నారు. ప్రజలు కూడా ఈ సేవను వినియోగించుకోవాలని, అలాగే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . వేసవికాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగించబడుతుంది అని తెలిపారు. అనంతరం పోచంపల్లి రాజేందర్ రెడ్డి ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు తూర్పటి చిరంజీవి, శ్యామ్ సుందర్,గుత్తా భాస్కర్ రెడ్డి మరియు పలువురు నాయకులు,యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి చిత్రా పటానికి క్షీరాభిషేకం



**ఎల్ బినగర్, నినాదం:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించడం పట్ల వాసవి అన్న ప్రసాద ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలో వాసవి అన్న ప్రసాద ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగల జాబితాలో అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.తదనంతరం మజ్జిగ పంపిణీ, నిరుపేదలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ప్రొద్దుటూరు శ్రీనివాస్, పద్మ కిషోర్, కోశాధికారి, శాశ్వత సలహాదారులు, తాడేపల్లి వెంకటేశం గుప్తా, తడకమల్ల సుభాకర్ రావు, పి.వి.ఎస్. మనోహర్ రావు, జగని రమేష్, రామా రావు, దామోదర్ రెడ్డి, మాణిక్ రావ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కి వీడ్కోలు

### -డివిజన్‌ల అభివృద్ధిలో వారి సేవలు మరువలేనివి: మాజీ కార్పొరేటర్‌లు



**ఎల్ బినగర్, నినాదం:** గ్రేటర్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొ రేషన్ ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిష నర్గా సేవలందించిన హేమంత్ కేశవ్ పాటిల్ తన పదవి బాధ్యతలను పూర్తి చేసుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరుగా బాధ్యతలు స్వీక రించనున్న సంద ర్భంగా, గడ్డి అన్నారం డివిజన్ మా జీ కార్పొరేటర్‌లు జోనల్ కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా వీడ్కోలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ లు మాట్లాడుతూ.. నియోజక వర్గ పరిధిలోని డివిజన్ ల అభివృద్ధికి హేమంత్ కేశవ్ పాటిల్ సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు వారు అందించిన సహకారం మార్గదర్శకత్వం ప్రశంసనీయమని అన్నారు. అలాగే, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరుగా వారు కొత్త బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ ఎంసి మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, నర్సింహా గుప్తా, నాయికోటి పవన్, కళ్లెం నవ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

# సాగునీటి వివక్షత పై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

### ఏప్రిల్ 29...ఆర్. విద్యా సాగర్‌రావు వర్ధంతి



వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టు ల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్ను దన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరైపోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. "జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహాను భావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన.ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939 -- 2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలి సారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవ రావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధి లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరిం గులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు.బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్స రాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు.తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగా హన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించ బడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను "లీడింగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాల న్నింటినీ కలిపి.. 'నీళ్లు-నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు.ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యు డిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగాసుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు.

కొంత కాలం అనారో గ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగ తులైనారు.


-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494


## ఆరెగూడెం వద్ద రోడ్డు ప్రమాదం ఒకరు మృతి



**వెల్దుర్తి, ఏప్రిల్ 28 (నినాదం):** వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారం గ్రామానికి చెందిన మృతిచెందగా అందుగులపల్లి గ్రామానికి ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి వివరాలకు వెళ్తే ధర్మారం గ్రామానికి చెందిన మరికంటి శంకర్ 36 పని నిమిత్తం వెల్దుర్తికి వచ్చి తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అటువైపు నుండి అందుగులపల్లి గ్రామానికి చెందిన అక్కముల వినేష్ గ్రామానికి చెందిన చింతల రాజమణి పద్మను తన ద్విచక్ర వాహనంపై తీసుకొని వస్తుండగా ఇండియన్ గ్యాస్, గోదాం వద్ద, ఎదురు ఎదురుగా వస్తున్న, రెండు వాహనాలు, ఢీకొనడంతో శంకర్ వాహనం, అదుపుతప్పి పడిపోయి తల పగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు, అందుగులపల్లి గ్రామానికి చెందిన వినేష్ కు, తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉందని, తెలిసింది. ఇద్దరి మహిళలకు కూడా తీవ్ర గాయాలు, కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు విజయ, ఆనంద్, భార్య స్వప్న, ఓ కూతురు, కుమారులు, ఉన్నారు. చేతికి వచ్చిన కొడుకు పని నిమిత్తం వెల్దుర్తి కి వచ్చి అంతలోనే రోడ్డు ప్రమాదంలో విగత జీవి కావడంతో కుటుంబ సభ్యులు బంధువుల రోదనలు మిన్నంటాయి, రోడ్డుపైన ధాన్యం ఆరపోయడం వల్లనే తమ కుమారుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ధాన్యం ఆరబోసిన వారిపై తగు చర్యలు, తీసుకోవాలని, అధికారులకు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇదేదారిపై రైతులందరూ విచ్చలవిడిగా ధాన్యం వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగాయని గత సంవత్సరం ఇదే రోడ్డుపై కొందరు చనిపోయి కొన్ని కుటుంబాలు వీధిన పడ్డాయని రోడ్డు గుండా వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహన దారులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు దీనిపై స్పందించిన పోలీసులు బాధ్యులపై చర్యలు, తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పట్టపగలు వృద్ధురాలు మెడలో బంగారం చోరీ

- గొంతు పిసికి,నోరు మూసి హత్యాయత్నం?
- పెనుగులాటలో వేలు కొరకడంతో పరారైన యువకుడు
- మెడ, ముఖం, నాలుక పై తీవ్ర గాయాలు
- కేసు పెట్టకుండా పెద్ద మనుషుల రాజీ'కీయం



**పాలేరు ఏప్రిల్ 28( నినాదం):** పట్టపగలు ఎవరూ లేని సమయంలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధ మహిళ ఇంట్లోకి ఓ యువకుడు ప్రవేశించి బలవంతంగా గొంతు పిసికి,నోరు మూసి మెడలో రెండు తులాల బంగారం చోరీ చేసిన సంఘటన నేలకొండపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి, వచ్చింది.బాధితురాలు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంగాపురం తండాకు చెందిన భూక్యా మేసి తన చిన్న కుమారుడు భూక్యా రాముడుతో కలిసి జీవిస్తుంది.సోమవారం మేసి ఇంట్లో నిద్రపోతుండగా అదే తండాకు చెందిన హరి అనే యువకుడు మధ్యాహ్నం సుమారుగా 12 గంటలు సమయంలో ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న బంగారం నానుతాడు లాగే ప్రయత్నం చేయగా వృద్ధ మహిళ మేల్కొని అడ్డగించబోయింది. దీంతో ఆమె అరవకుండా గొంతు పిసికి,నోరు మూసి హత్యాయత్నం చేయగా పెనుగులాటలో ఆమె ఆ యువకుడి వేలు కొరకడంతో బంగారం తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.ఆమె అరుపులు విన్న చుట్టుపక్కల వాళ్లు,కుటుంబ సభ్యులు ఆమె మెడ పై,గొంతు పై ఉన్న గాయాలను చూసి ఏమైందని ప్రశ్నించగా పూర్తి వివరాలు వెల్లడించింది.అనంతరం ఆమెను ఆటోలో తీసుకుని నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా పోలీసులు వైద్య చికిత్స నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తారు.ఈ నేపథ్యంలో దొంగతనం విషయం ఆ నోటా ఈ నోటా తండా మొత్తం దావలా వ్యాపించగా దొంగతనానికి పాల్పడిన యువకుడి కుటుంబ సభ్యులే తిరిగి ఏకంగా బాధితురాలు ఇంటిపైకి వచ్చి రాముడు భార్య పై దాడికి యత్నించారని వాపోయారు.

**షాడో సర్పంచ్ 'రాజీ'కీయం..!**

చోరిలో భాగంగా మెడ పై గాయాలు,నాలుక మొత్తం పగిలి,నల్లగా కమిలి,ఆయాస పడుతూ మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో వృద్ధురాలు బాధపడుతుంటే మంగాపురం తండా షాడో సర్పంచ్ గా వ్యవహరిస్తున్న రాధాకృష్ణ,బాలాజీతో కలిసి రంగ ప్రవేశం చేసి నిందితుడు తరపున వకాల్తా పుచ్చుకుని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయకుండా అడ్డుపడ్డారని బాధితులు తెలిపారు.పెద్ద మనుషులం చెబుతున్నాం మా మాట వినాలి.కేసు పెట్టవద్దని,ఒకవేళ కేసు పెడితే బంగారం రాదని మాయమాటలు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.తండాలో మాట్లాడుకుందామని చోరీ చేసిన బంగారంతో పాటుగా నష్టపరిహారంగా పదివేలు ఇచ్చారని వెల్లడించారు.

**న్యాయం చేయాలని వేడుకోలు..**

మెడలో బంగారం చోరి చేసిన సమయంలో వృద్ధురాలు నిందితుడు హరి వేలు కొరకడంతోనే బంగారం తీసుకుని పరారయ్యాడని లేకపోతే గొంతు పిసికి చంపేవాడని కన్నీటి పర్యంతమయ్యారు. పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని వేడుకొంటున్నారు.

**చైన్ స్నాచింగ్ కేసు నమోదు చేశాం:ఎస్సై పి.సంతోష్..**

వృద్ధ మహిళ మెడలో బంగారం చోరి పై ఎస్సై పి. సంతోష్ ను చర వాణిలో వివరణ కోరగా చైన్ స్నాచింగ్ కేసు నమోదు చేశామ ని,ఆసుపత్రిలో మెడికల్ సర్టిఫికెట్ తీసుకుని పూర్తి వివరాలు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్ కి పంపిస్తామని తెలిపారు.

## బ్యాటరీ దొంగలు అరెస్ట్



**మంచిర్యాల, ఏప్రిల్ 28 (నినాదం):** బ్యాటరీ దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు మందమర్రి సీఐ రమేష్ పేర్కొన్నారు. సింగరేణి ఏరియా స్టోర్స్‌లో బ్యాటరీలు దొంగతనానికి గురైనట్లు ఈ నెల 25న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు.మంగళవారం ఉదయం సుమారు 9 గంటల సమయం లో మందమర్రి ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో కలిసి నార్లాపూర్ గ్రామ సమీపంలోని హైవేపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఒక ఆటో పోలీసులు కనిపించగానే అనుమానా స్పదంగా వెనక్కి తిప్పుకొని పారిపోవడానికి ప్రయత్నించింది. వెంటనే పోలీసులు ఆటోను అడ్డుకొని తనిఖీ చేయగా అందులో 25 బ్యాటరీలు లభించాయని తెలిపారు.ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులను విచారించగా వారు సింగరేణి ఏరియా స్టోర్స్‌లో ఈ నెల 20న అర్ధరాత్రి సమయంలో బ్యాటరీలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. మందమర్రి కి చెందినధనకుంట్ల మునియప్ప (19),జన్నె నరేంద్ర (19), గాజుల శివప్రసాద్ (20), ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అనంతరం రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.ఈ కేసును ఛేదించిన ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది రాకేష్, మహేష్, కృష్ణ, శ్రీనివాస్‌లను మందమర్రి సీఐ అభినందించారు.

## మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్

**హైదరాబాద్,ఏప్రిల28(నినాదం):** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరఫున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.. కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.. ఒక నెలకు పైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఏపికి చెందిన ఓ ఎంపి కూడా దొరికినా స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై



**పాలేరు ఏప్రిల్ 28( నినాదం):** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామ యూత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నేలకొండపల్లి ఎస్సై సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ సర్పంచ్ బోయిన వేణు తో కలిసి ప్రారంభించారు. వేసవి కాల దృష్ట్యా తీవ్రమైన ఉష్ణోగ్రతల ప్రభావంగా గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ బోయన రేణుకా రావు సూరేపల్లి ప్రభాకర్ లింగం వేణు ఉదయ్ కిరణ్ బ్రహ్మం యేసు రత్నం గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవలో ఘనాపాఠీ ...

## రారెవరూ ఆయనకు సాటి

### -ఏప్రిల్ 29...వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి

నీతి, నిజాయతీలకు మారుపేరు, నిబద్ధతకు ప్రతిరూపం ఆయన. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయాల విలువలకు పెద్దపీట వేసి, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చైతన్యశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ శాసనసభ్యుడు, గ్రంథాలయోద్యమ సారథి, రాష్ట్ర తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, బహుగ్రంథకర్త. పోరాట యోధుడు, ప్రజా సేవకుడు. ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు.ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఖాదీ దుస్తులతో, చేతిలో ఖాదీ సంచితో నిరాడంబరంగా కనిపించే అజాత శత్రువు.ఆయన గురించి ఎంత రాసినా తక్కువే. ఆయనే ప్రజలు మెచ్చిన నేత...వావిలాల గోపాల కృష్ణయ్య.

వావిలాల గోపాలకృష్ణయ్య (సెప్టెంబరు 17, 1906 – ఏప్రిల్ 29, 2003) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత.1906 సెప్టెంబరు 17న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహంలో గార్లపాటి హనుమంతరావు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యుడిగా ఉంటూ, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావల్సిందేనని పట్టుబట్టారు.1925లోనే సత్తెనపల్లిలో 'శారదానిలయం' అనే గ్రంథాలయాన్ని, వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేశారు. 1974 – 77 కాలంలో తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘ సంయుక్త కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డు సభ్యుడిగా పనిచేసారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడటంతో అక్కడ పోటీ చేసి తొలి శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా గెలిచి 19 ఏళ్ల పాటు ప్రజా సేవలో నిలిచారు. ఆయన కృషి ఫలితంగానే శాతవాహన నూలు మిల్లు, ఫణిదం చేనేత సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. సమాజంలో అసమానతలను రూపు మాపేందుకు ఎంతో కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమ సంస్థ బాధ్యుడిగా, గ్రంథాలయ ఉద్యమ రథ సారధిగా, దళిత, గిరిజనోద్ధరణ ఉద్యమ నాయకుడిగా ఆయన ముందు నడిచారు. పద్మభూషణ్‌తో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలను అందుకున్నారు.ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంథాలు రచించిన మేధావి. తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచించారు.1922లో 'శివాజీ', 1947లో మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి? 1951లో విశాలాంధ్రం, 1976–77లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం తదితర రచనలు చేశారు.పత్రికా విలేఖరిగా ప్రారంభించి ప్రజా సేవకే సర్వం త్యాగం చేసిన త్యాగశీలి, ధన్య జీవి గోపాలకృష్ణయ్య. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం ఆయన చేసిన కృషి మరువ రానిది. నాటి ప్రధాని నెహ్రూ చేత ఆ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేయించటంలో వావిలాల కృషి మరవ లేనిది.ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది.చివరి రోజులలో ఆనారోగ్యానికి గురై నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న ఆయన 2003 ఏప్రిల్ 29న మరణించారు. వావిలాల శత జయంతిని పురస్కరించుకొని 2006 సెప్టెంబర్ 14వ తేదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నాటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, నాటి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, నాటి సహకార శాఖ మంత్రి కన్నా లక్ష్మీనారా యణ తదితరుల భాగస్వామ్యంతో సత్తెనపల్లి తాలుకా సెంటర్‌లో వావిలాల గోపాలకృష్ణయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

